క్లుప్తంగా

నీవానది పరివాహక ప్రజలకు రక్షణ కల్పించాలి

చిత్తూరు కార్పొరేషన్: నీవానది పరివాహక ప్రజలకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు తెలిపారు. నగరంలో వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. వరుసగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీవానది ప్రవాహం పెరిగిందన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నదీ ప్రవాహ ప్రాంతంలో రెండు పక్కల గోడ నిర్మించి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. కూటమి నాయకులు ఎన్నికలప్పుడు హామీనిచ్చి దాని ఊసే ఎత్తలేదన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా చిత్తూరు నగరానికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. దాంతో ప్రహరీ గోడ, డ్రైనేజీ వ్యవస్థకు మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరదలు వచ్చినపుడే కాకుండా ముందుగానే ప్రత్నామ్యాయ మార్గాలు చూడాలన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): భర్తతో గొడవ పడి భార్య అదృశ్యంపై శుక్రవారం బీఎన్ఆర్‌పేట పోలీసులు కేసు నమోదుచేశారు. ఎస్ఐ నాగసౌజన్య వివరాల మేరకు గుడిపాల మండలం కనకనేరి గ్రామానికి చెందిన దంపతులు చిత్తూరు మండలం వీఎన్‌పురం గ్రామంలోని ఓ మామిడితోటలో పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. వీరిద్దరికి రెండు రోజులకు క్రితం గొడవలయ్యాయి. భార్య కుమార్తెను వెంటబెట్టుకుని కనిపించకుండా పోయింది. భర్త ఊరంతా గాలించాడు. ఆచూకీ తెలియకపోవడంతో బీఎన్ఆర్‌పేట పోలీసులను ఆశ్రయించాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


హరినాథ్‌రెడ్డి (ఫైల్)

ఐరాల: మండలంలోని ఎర్రైపల్లెకు చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు హరినాథ్‌రెడ్డి(73) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన 1984 నుంచి ఎర్రైపల్లె పంచాయతీకి నాలుగు సార్లు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా గెలుపొందారు. ఎర్రైపల్లెలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు బంధువులు తెలిపారు. మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు గ్రామానికి చేరుకుని హరినాథ్‌రెడ్డి మృతదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు.

గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు



గుడిపాల: టెంపో ట్రావెలర్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రంగా గాయపడినట్టు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. చిత్తూరు–వేలూరు రహదారిలోని పానాటూరు వద్దనున్న క్రిష్ణ గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం ఉదయం వేలూరు నుంచి చిత్తూరు వైపు గుర్తు తెలియని ఓ వ్యక్తి నడుచుకుంటూ వస్తుండగా టెంపో ట్రావెలర్ బస్సు ఢీకొందని తెలిపారు. తలకు బలమైన గాయమైందని, అతన్ని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. అతని గురించి ఎవరికైనా వివరాలు తెలిసినట్లయితే 9440796712 నంబర్‌కు కాల్ చేయాలని ఎస్ఐ తెలిపారు.

స్వామిత్వ సర్వేకు సహకరించాలి


స్వామిత్వ సర్వే చేస్తున్న అధికారులు

పెద్దపంజాణి: మండలంలోని చిన్నేపల్లి గ్రామంలో శుక్రవారం స్వామిత్వ సర్వే చేసినట్టు డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ గ్రామ కంఠాలలోని ఇళ్లు, ఖాళీ స్థలాలకు ఆస్తి యాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వడానికి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే సమయంలో ప్రజలు సహకరించి వారి ఇళ్లను, ఖాళీ స్థలాలను దగ్గరుండి సర్వే చేయించుకోవాలని పేర్కొన్నారు. ఎంపీడీవో బాలాజీ, పీఎస్ వినోద్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంటు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవహిస్తున్న వాగులు, వంకలు

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణాల్లో రోడ్లపైనే మురుగు నీరు ప్రవహిస్తోంది. వాగులు, వంకలు జోరుగా సాగుతున్నాయి. చెరువుల్లోకి నీరు చేరింది. కొన్ని చెరువులు మొరవలు పోతున్నాయి. యాదమరి మండలంలోని నుంజర్ల ప్రాజెక్టు నిండింది. చిత్తూరు నగరంలోని తేనబండ బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలను నిలిపేశారు.


చిత్తూరులోని తేనబండ బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ తదితరులు


పొంగిపొర్లుతున్న గువ్వకల్లు వంక

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పలు లోతట్టు ప్రాంతాల్లోకి శుక్రవారం వర్షపు నీరు చేరింది. చిత్తూరు నగరంలో రెండు రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వీరభద్రకాలనీ, తేనబండ, ధర్మరాజులు గుడి వీధి, నీవానది, ముత్యాలమ్మగుడి వీధి, ఏటివార ప్రాంతాల్లో ఇళ్ల మధ్య వర్షపు నీరు నిలిచింది. తేనబండ బ్రిడ్జిపై వర్షపు నీరు ప్రవహించింది. సమాచారం అందుకున్న మునిసిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. భారీ వర్షం వస్తే ప్రజలు వాగును దాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు. బ్రిడ్జికి ఇరువైపులా ఓ తాడును కట్టి ఉంచారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు.

చిత్తూరు రూరల్ మండలంలో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిత్తూరు మండలంలోని వంకలు, వాగులు, చెరువులు జలకళలను సంతరించుకున్నాయి. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తాళంబేడు గ్రామం నుంచి కాలనీకి వెళ్లే రోడ్డులో వర్షపు నీరు ప్రవహిస్తోంది. గువ్వకల్లు వంక పొంగిపొర్లుతోంది. అరతల చెరువు, దిగువమాసాపల్లి, పచ్చనపల్లి, వెంకటాపురం తదితర చెరువుల్లోకి నీరు చేరింది. బీఎన్ఆర్‌పేట వంకలోని రోడ్డు తెగింది. ఈ కారణంగా బీఎన్ఆర్‌పేట నుంచి జీడీనెల్లూరు మండలం ఆత్మకూరు వైపు వెళ్లే మార్గం నీటి ఉద్ధృతికి కొట్టుకోపోయింది. ఆ మార్గంలో రాకపోకలు నిలిచాయి.



యాదమరి : మొరవ పోతున్న నుంజర్ల ప్రాజెక్టు, ఇంద్రవరదుని ఆలయం ముందు ప్రవహిస్తున్న త్రివేణి సంగమం

ప్రవహిస్తున్న వాగులు

యాదమరి: మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి భూమిరెడ్డిపల్లి సమీపంలోని నుంజర్ల ప్రాజెక్టు నిండి మొరవపోతోంది. నీరు దిగువన ఉన్న చెరువుల్లోకి చేరుతోంది. యాదమరిలోని నీవా నదిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు ఇంద్రవరదుని ఆలయాన్ని స్పృశించింది. శుక్రవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలకు అంతరాయం కలిగింది. కొన్ని గ్రామాల్లో కాలువలు లేకపోవడంతో మురుగు నీరు వీధుల్లో ప్రవహిస్తోంది.

పొంగిపొర్లుతున్న నారగల్లు చెరువు

గుడిపాల: మండలంలోని తమిళనాడు సరిహద్దులో ఉన్న నారగల్లు చెరువు శుక్రవారం పూర్తిగా నిండింది. గ్రామస్తులు ఈ చెరువు కట్టపై నుంచే రాకపోకలు సాగించాల్సి వుంది. లేదంటే సుమారు ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లి తమిళనాడు నుంచి రావాల్సి ఉంది. చెరువు నీరు ఉద్ధృతంగా వస్తుండడంతో రాకపోకలు సాగించకూడదని స్థానిక సర్పంచ్ మోహన్, పంచాయతీ కార్యదర్శి మియాజ్, వీఆర్ఏ రాజ్‌కుమార్ చెరువుకు ఇరువైపులా రెడ్‌మార్క్ గుడ్డను కట్టి అడ్డుకట్ట వేశారు. నీరు తగ్గేంత వరకు ఇటువైపు రాకూడదని ప్రజలకు తెలియజేశారు.

తవణంపల్లెలో ఎడతెరపిలేని వర్షం

తవణంపల్లె: మండలంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. తవణంపల్లెలో చిత్తూరు–అరగొండ రోడ్డు దెబ్బతినింది. గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో శుక్రవారం 42.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. మాధవరం వంక ప్రవహిస్తోంది.


చిత్తూరు రూరల్ : తెగిన బీఎన్ఆర్‌పేట వంక, తాళంబేడు రోడ్డులో ప్రవహిస్తున్న నీరు, చెరువు కట్ట వద్ద నిలిచిన వాహనాల రాకపోకలు, తవణంపల్లెలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు, వర్షాలకు ప్రవహిస్తున్న మాధవరం వంక

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


బంగారుపాళెం: గుంతూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న కవిత

బంగారుపాళెం : పోషకాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత తెలిపారు. మండలంలోని గుంతూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా పోషకాహార వంటలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. సర్పంచ్ ద్రాక్షాయణి మాట్లాడు తూ కుటుంబంలో మహిళలు, పిల్లల ఆరోగ్యం ప ట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన బాధ్యత యజమానిదేనన్నారు. తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌వెంగల్‌రాయన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎస్టీల సమగ్ర అభివృద్ధికి చర్యలు


జనన ధ్రువీకరణ పత్రాలతో పిల్లలు, మునిసిపల్ అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఎస్టీల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలోని శేషాచలపురం కాలనీలోని పలువురు పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ శేషాచలపురంలో పలువురు విద్యార్థులకు జనన ధ్రువీకరణ పత్రాలు లేనట్టు గుర్తించామన్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఇక్కడున్న పిల్లలకు పత్రాలను సిద్ధం చేసి, అందజేశామన్నారు. ఎస్టీ కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మాతాశిశు సేవల్లో నిర్లక్ష్యం వద్దు


మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మాతా శిశు సేవలు అందించడంలో నిర్లక్ష్యం వద్దని డీఎంఅండ్ హెచ్‌వో సుధారాణి ఆదేశించారు. ఆమె శుక్రవారం చిత్తూరులోని తన కార్యాలయంలో మాతా శిశు మరణాలపై శాఖ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణుల నమోదు నుంచి ప్రసవం వరకు ఆరోగ్య సేవలను అందించడంలో అలసత్వం ఉండకూడదన్నారు. గర్భిణులకు సరైన వైద్యం అందేలా చూడాలన్నారు. ముఖ్యంగా మాతాశిశు మరణాలను కట్టడి చేయాలన్నారు. ఇందుకు క్షేత్రస్థాయిలో అందరూ సమిష్టిగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం జరిగేలా చూడాలన్నారు. అలాగే ప్రసవించిన బిడ్డకు అన్ని రకాల టీకాలను క్రమం తప్పకుండా వేయాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ పద్మాంజలి దేవి, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటిండెంట్ ఉషశ్రీ, వైద్యులు లత, ప్రశాంతి, ప్రవీణ, అనూష, సునంద, సింధూర, పద్మజరాణి, సాయి కిరణ్, రోజ రాణి, శ్యామ్ సుగుణకుమారి పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబం సురక్షితం


తవణంపల్లె జి.గొల్లపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు


గుడిపాల: మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య

తవణంపల్లె: మహిళల ఆరోగ్యంతోనే కుటుంబం సురక్షితంగా ఉంటుందని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని జి.గొల్లపల్లెలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, కిశోరబాలికలకు పరీక్షలు, క్షయవ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు, ఆయుష్ సేవలు, మానసిక వైద్య సేవలను సైతం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌వేలు, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

గుడిపాల: మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వసంతాపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్ సంధ్య తెలిపారు. ఆమె శుక్రవారం సర్పంచ్ రజినీకాంత్ అధ్యక్షతన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. మహిళలకు పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుందరేషన్, కమ్యూనిటీ బాల సూర్యనారాయణ, డీపీఎంవో క్రిష్ణ, వైద్యసిబ్బంది చంద్రశేఖర్, జబసెల్వి, ఉమామహేశ్వరి, స్వప్న, సుజిమ పాల్గొన్నారు.

శ్మశానానికి దారి ఏర్పాటుకు చర్యలు


శ్మశానానికి దారి సౌకర్యంపై కలెక్టర్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

గుడిపాల: చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే వల్ల శ్మశానానికి వెళ్లే రోడ్డు లేకుండా పోయిందని, దారి సౌకర్యం కల్పించాలని సింగారిపేట గ్రామస్తులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. స్పందించిన ఆయన శుక్రవారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. రోడ్డు పక్కన భూమి సేకరించి దారి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా చలిచీమలపల్లె వద్ద హైవే రోడ్డు వేయడంతో చెరువు నీరు గ్రామాల్లోకి ప్రవహిస్తోందని, దానికి అడ్డుకట్టవేసి వేరే రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. చలిచీమలపల్లె గ్రామస్తులు తమ గ్రామానికి ఉన్న శ్మశానం రోడ్డుకు పోవడంతో తమకు శ్మశానం లేదని ఆయనకు తెలియజేశారు. వాటన్నింటికి సంబంధించి కొత్తగా భూమిని కేటాయిస్తామని కలెక్టర్ తెలియజేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి కమ్మతిమ్మాపల్లె హైస్కూల్ ప్రహరీగోడ పడిపోవడంతో తిరిగి నిర్మిస్తామన్నారు. మరుగుదొడ్లు, వంటగదులకు మరమ్మతులు చేయాలని హెచ్ఎంలు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వెంటనే కలెక్టర్ పనులు ప్రారంభించాలని, నిధులను మంజూరు చేయిస్తామన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కుమార్, పీఆర్ ఏఈ ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల రిలే దీక్ష


రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం ఎదుట జేఏసీ నాయకులు మాట్లాడారు. సంస్థలోని ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలన్నారు. దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు ఇవ్వాలన్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 15 తేది నుంచి నిరసన వ్యక్తం చేస్తున్నమన్నారు. అందులో భాగంగా రిలే నిరాహార దీక్ష చేపట్టామన్నారు. సోమవారం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుంటామన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నమన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, యజ్ఞేశ్వరరావు, వివేకానందరెడ్డి, శేషాద్రిరెడ్డి, చంద్రమౌళి, రాజ్‌సాహెబ్, అక్బర్, యుగంధర్, దొరబాబు, సతీష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


గుడిపాల: మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవో

గుడిపాల: ఎస్టీ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కుమార్ తెలిపారు. వారు శుక్రవారం ఎఎల్‌పురం, గుడిపాల ఎస్టీ కాలనీల్లో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆధార్, రేషన్ కార్డులు, ఇళ్లు లేని వారికి ఇళ్లు, తాగునీరు, వాటర్ ట్యాంకులు, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తదితరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ ప్రసాద్‌నాయుడు, ఏపీఎం సుధారాణి, ట్రాన్స్‌కో ఏఈ శివకుమార్, ఎంఈవో గణపతి పాల్గొన్నారు.

మహాసభలకు వెళ్లిన నాయకులు


మహాసభలకు వెళ్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర మహాసభలు శని, ఆదివారం ఒంగోలులో జరుగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు శుక్రవారం చిత్తూరు నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు రైలులో తరలివెళ్లారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు గంగరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలపై చర్చించి భవిష్యత్‌లో పోరాటాలు చేయడానికి మహా సభల్లో తీర్మానాలు చేస్తామనన్నారు. గతంలో అనేక పోరాటాల ఫలితంగా కొన్ని హక్కులను సాధించుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం వేతనాలు పెంచడం, శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులను తీసుకోవడం వంటి సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచలేమని చెప్పడం సరికాదని విమర్శించారు. ప్రభుత్వం అంగన్‌వాడీలతో అన్ని పనులు చేయించుకుంటూ జీతాలు పెంచడం సరైంది కాదన్నారు. నూతన కమిటీని ఎన్నుకొని పోరాటాలు చేస్తామన్నారు. మహాసభలకు జిల్లా ప్రధాన కార్యదర్శి షకీలా, విజయ, శోభ, సుభాషిని, కోకిల, కళావతి, చెంచులక్ష్మి తదితరులు వెళ్లారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న పులిపాటి దుర్గారెడ్డి

ఐరాల: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడి దివ్యాంగుల పింఛన్లు రద్దు చేయడం దుర్మార్గమని, దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేస్తామని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పులిపాటి దుర్గారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కొణతం చంద్రశేఖర్‌తో క్షేత్రస్థాయిలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 20 వేల మంది దివ్యాంగులకు నోటీసులు ఇచ్చారని, వారిలో ఎక్కువ మంది అర్హులు ఉన్నారని తెలిపారు. వారికి తిరిగి పింఛన్లు ఇప్పించేందుకు ఆందోళనలు, ధర్నాలు నిర్వహించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే దివ్యాంగుల పింఛన్లు రద్దు చేసిందని ఆరోపించారు. వారి కడుపు కొట్టకుండా సదరం రీ వెరిఫికేషన్‌ను నిష్పక్షపాతంగా నిర్వహించి అర్హులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు జనార్దన్, రమేష్, వెంకటస్వామి, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న గ్రానైట్ లారీ


మొగిలి ఘాట్‌లో ట్యాంకర్‌ను ఢీకొన్న గ్రానైట్ లారీ

బంగారుపాళెం : మండలంలోని మొగిలి ఘాట్ వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం రాత్రి సిమెంట్ ట్యాంకర్‌ను గ్రానైట్ లారీ ఢీకొంది. దీంతో లారీ డ్రైవర్లు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు నుంచి చిత్తూరు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్‌ను గ్రానైట్ బండను తరలిస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రహదారిపై ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ ద్వారా పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

డివైడర్‌ను ఢీకొన్న కంటైనర్

మండలంలోని మొగిలి కూడలి వద్ద శుక్రవారం తెల్లవారు జామున బెంగళూరు నుంచి చెన్నై వెళుతున్న కంటైనర్ వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ గాయపడ్డాడు. అతన్ని 108 సిబ్బంది బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శాస్త్రోక్తంగా ప్రదోష పూజలు

కాణిపాకం: శనిత్రయోదశిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రదోష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్, నందీశ్వరుడికి ఏకకాలంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

గాలికుంటు వ్యాధిని అరికట్టడానికే టీకాలు


పొన్నేడుపల్లెలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ శ్రీధర్

తవణంపల్లె: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా అరికట్టడానికే టీకాలు వేస్తున్నట్లు తవణంపల్లె పశువైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఆయన శుక్రవారం పొన్నేడుపల్లెలో పశువులకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 1,033 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. శనివారం జి.వడ్డిపల్లె, దిగువ మారేడుపల్లె, కురప్పల్లె, కట్టకిందపల్లె, ఎడమలవారిపల్లె, పత్రపల్లె, వడ్డిపల్లె గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తామన్నారు. రైతులు వెటర్నరీ సిబ్బందికి సహకరించి పశువులకు టీకాలు వేయించాలని సూచించారు.

టీకాలతో గాలికుంటు వ్యాధి నివారణ

ఐరాల: పాడి ఆవులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పక వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జ్ జేడీ అబ్దుల్‌ఆరిఫ్ తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా శుక్రవారం మద్దిపట్లపల్లె పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పెండ్లి గుండ్లపల్లె, కుమ్మరపల్లె, ఎర్రైపల్లె గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ పశువుల నోరు, కాలిగిట్టల మధ్య పుండ్లు రావడం, 104 జ్వరం ఉండడం గాలికుంటు వ్యాధి లక్షణాలన్నారు. వ్యాధిసోకిన పాడి పశువుల్లో తగ్గేపాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చన్నారు. పశువులకు వ్యాధి వచ్చిన తర్వాత వైద్యం చేయించుకోవడం కంటే ముందుగానే నివారణ టీకాలు వేయించాలని సూచించారు. మండల వ్యాప్తంగా 1,242 పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు.